


మా ఆయనకు మళ్లీ పెళ్లి

- భర్తకు మూడో వివాహం చేసిన ఇద్దరు భార్యలు
- పెదబయలు మండలంలో ఘటన



-వార్త మెయిన్ 7లో..

అరకు కాఫీ అమోఘం

అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన జీసీసీకి ప్రధాని ప్రశంసలు

- మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావన
- ఆనందం వ్యక్తం చేసిన జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్, కలెక్టర్ దినేశ్‌కుమార్

విశాఖపట్నం/ పాడేరు, జూన్ 30:

అరకు వ్యాలీ కాఫీని ప్రపంచ వ్యాప్తంగా విస్తృతం చేయడంలో గిరిజన సహకార సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో జీసీసీ, ఏపీ ప్రభుత్వం సహకారంతో గిరిజనులు సాగు చేస్తున్న అరకువ్యాలీ కాఫీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మనదేశ ఉత్పత్తులు ప్రపంచస్థాయి గుర్తింపు సాధిస్తుండడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో గిరిజనులు అధిక విస్తీర్ణంలో కాఫీ పంట సాగు చేస్తున్నారని, శ్రేష్ఠమైన అరోమా రుచి కలిగిన అరకు కాఫీ మంచి గుర్తింపు పొందిందన్నారు. 1.50 లక్షల ఆదివాసీ కుటుంబాలు అరకు కాఫీ సాగు, ఉత్పత్తి, విక్రయాలతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారని కొనియాడారు. కాఫీకి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడంలో విశేషమైన కృషిచేస్తున్న జీసీసీ సేవలను ప్రశంసించారు. గతంలో విశాఖను సందర్శించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి అరకు కాఫీని ఆస్వాదించే అవకాశం లభించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా అరకు వ్యాలీలో కాఫీ సాగు, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం గర్వంగా ఉందని జీసీసీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేశ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. అరకు కాఫీ గొప్పతనాన్ని గుర్తించి, ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాన మోదీకి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో కలిసి 2016లో అరకు కాఫీ రుచి చూస్తున్న ప్రధాని మోదీ (ఫైల్ ఫొటో)

జిప్‌లైన్ పేరిట రూ.కోట్లు మింగేశారు!

రూ.65 లక్షలతో ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు

- పర్యటక శాఖకు 12 శాతం చెల్లించాలని ఒప్పందం
- 9 నెలలుపాటు నిర్వహణ

- కూటమి ప్రభుత్వం రాకతో జిప్‌లైన్ నిలిపివేత
- ప్రతిరోజూ వచ్చే ఆదాయం ఎవరి ఖాతాలో జమ అయ్యింది?
- పర్యాటక సంస్థకు వచ్చిన ఆదాయం ఎంత?
- పర్యాటక శాఖ అధికారులకు గిరిజన సంఘాలు, స్థానికులు ప్రశ్నల వర్షం
- సమగ్ర విచారణకు డిమాండ్



బొర్రాగుహలు ప్రవేశ గేటు సమీపంలో ఉన్న జిప్‌లైన్ నిలిచిపోయిన దృశ్యం

అరకులోయ, జూన్ 30:

ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రాగుహలు సమీపంలో ఏర్పాటు చేసిన జిప్‌లైన్ పేరిట కోట్లాది రూపాయలు మింగేశారు. పంచాయతీ, పెసా చట్టాలు అతిక్రమించి టూరిజం శాఖ ఉన్నతాధికారులు ప్రైవేటు వ్యక్తితో ఒప్పందం చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. ప్రైవేటు వ్యక్తితో ఏర్పాటు చేసిన జిప్‌లైన్ ద్వారా వచ్చిన ఆదాయంలో 12 శాతం మాత్రమే టూరిజం శాఖకు చెల్లించాలని చేసుకున్న ఒప్పందంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. వచ్చిన ఆదాయం ఎవరికి చేరిందని నిలదీస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలు సమీపంలో సాహసక్రీడల్లో భాగంగా జిప్‌లైన్‌ను రూ.65 లక్షలతో బొర్రాగుహలు ముందు ఏర్పాటు చేశారు. ఈ జిప్‌లైన్‌ను అనుభవం ఉన్న సంస్థకు టెండర్ ద్వారా నిర్మాణపు బాధ్యతలు అప్పగించినట్టు పర్యాటక అభివృద్ధి సంస్థ ఆర్‌డీ శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఒక ప్రైవేటు వ్యక్తితో ఒప్పందం చేసుకొని పర్యాటక శాఖకు 12 శాతం ఇచ్చేలా టూరిజం శాఖ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. తొలుత ఆర్‌డీ ప్రకటించినట్టుగా కాకుండా ఆ ప్రైవేటు వ్యక్తే జిప్‌లైన్‌ను రూ.65 లక్షలతో నిర్మించుకున్నాడు. దీనిని 2023 సెప్టెంబర్ 20వ తేదీన ట్రైల్‌రన్ వేశారు. దీనిపై ప్రయాణించాలంటే రూ.500 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. ఈ ట్రైల్‌రన్ ప్రారంభానికి అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆహ్వానం పంపినా ఆయన రాలేదు. అయినా అప్పటి నుంచి జిప్‌లైన్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నాటి నుంచి 2024 జూన్ 23వ తేదీ వరకు రన్ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జిప్‌లైన్‌ను నిలిపివేశారు.

ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టడంపై ఫిర్యాదులు

పంచాయతీ, పెసా పీసీ చట్టం మేరకు గ్రామసభలు లేకుండా జిప్‌లైన్‌ను ప్రైవేటు వ్యక్తికి ఎలా కట్టబెడతారని గిరిజన సంఘాలు ... మిగతా 6వ పేజీలో

నేడే పింఛన్ల పండగ

ఇంటి వద్దే సచివాలయ సిబ్బంది పంపిణీ



గిరిజన పింఛన్‌దారులు

- నేటి ఉదయం 6 గంటలకు ప్రారంభం
- పక్కా ఏర్పాట్లు చేసిన అధికారులు
- జిల్లాలో 1,27,894 మంది పెన్షన్‌దారులు
- పెన్షన్ పెంపుపై అవ్వా తాతలు, ఇతర లబ్ధిదారులు ఆనందం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెంచిన పెన్షన్ సొమ్ము సోమవారం నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పక్కాగా చేసింది. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పెన్షన్ సొమ్మును అందించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి నాలుగు వేల పెన్షన్‌ను అందజేయనున్నారు. ఈ మూడు నెలల బకాయిలను కూడా జూలై నెల పెన్షన్‌తో కలిపి ఏడు వేల రూపాయలు అందజేస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జేసీ, డీఆర్‌డీఏ పీడీ పర్యవేక్షిస్తుండగా, డివిజన్ స్థాయిలో ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, మండల స్థాయిలో ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలు పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం పెన్షన్ లబ్ధిదారుల్లో అధిక శాతం మంది వృద్ధాప్య పెన్షన్ పొందే అవ్వా తాతలే 76,462 మంది ఉన్నారు. తమకు ఇన్నాళ్లుగా అందిన రూ.3 వేలు పెన్షన్‌ను రూ.4 వేలుకు పెంచిన సీఎం చంద్రబాబును అవ్వా తాతలు ఆశీర్వదిస్తున్నారు. అలాగే ఇతర విభాగాల లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును పెంచడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2014 వరకు కేవలం రూ.200 ఉన్న పెన్షన్‌ను అప్పటి టీడీపీ ప్రభుత్వం తొలుత రూ. వెయ్యి, ఆ తర్వాత రూ.2 వేలు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ.3వేలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లలో రూ.1,000 పెంచడంపై లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేశారు.

జిల్లాలో సామాజిక పెన్షన్ లబ్ధిదారుల వివరాలు

వ.సం	మండలం	పెన్షన్‌దారులు
1.	కూనవరం	4,021
2.	గంగవరం	4,019
3.	రంపచోడవరం	4,649
4.	వీఆర్.పురం	3,766
5.	అరకులోయ	6,630
6.	మారేడుమిల్లి	2,039
7.	హుకుంపేట	7,325
8.	పాడేరు	6,714
9.	కొయ్యూరు	7,802
10.	ఏటపాక	6,195
11.	చింతూరు	5,169
12.	ముంచంగిపుట్టు	6,387
13.	దేవీపట్నం	4,475
14.	అడ్డతీగల	5,565
15.	అనంతగిరి	6,174
16.	వై.రామవరం	3,403
17.	డుంబ్రిగుడ	6,580
18.	పెదబయలు	6,257
19.	రాజవొమ్మంగి	6,594
20.	చింతపల్లి	9,623
21.	జి.మాడుగుల	6,649
22.	జీకేవీధి	7,858
	మొత్తం	1,27,894

జిల్లాలో 1 లక్షా 27 వేల 894 మందికి లబ్ధి

సామాజిక పెన్షన్ల పెంపుతో జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న 1 లక్షా 27 వేల 894 మందికి లబ్ధిదారులకు ...మిగతా 6వ పేజీలో

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

గిరిజనుల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఏడు గంటల నుంచే భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో ఆలయ ప్రాంగణంలో పండగ సందడి నెలకొంది. - పాడేరు రూరల్ - 6లో

రమణీయం ప్రకృతి సోయగం

- మనస్సు దోచే లంబసింగి ఘాట్ పొగ మంచు అందాలు

చింతపల్లి, జూన్ 30:

ఆంధ్ర కశ్మీర్‌గా పిలువబడే లంబసింగి ఘాట్‌లో పొగ మంచు అందాలు ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచేస్తున్నాయి. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం చిరుజల్లులు కురిశాయి. వాతావరణం పూర్తిగా చల్లబడింది. అనంతరం ఒక్కసారిగా పొగ మంచు లంబసింగి ఘాట్‌ని పలకరించింది. ఉదయం, సాయంత్రం లంబసింగి ఘాట్ అడవులను తాకుతూ పొగ మంచు పయనించింది. ఈ దృశ్యాలు వీక్షకులను కనువిందు చేస్తున్నాయి. అందమైన ఈ దృశ్యాలను కెమెరాలో బంధించేందుకు సందర్శకులు పోటీపడ్డారు.



లంబసింగి ఘాట్ బోడకొండమ్మ ఆలయం దిగువన ఆదివారం ఆవిష్కృతమైన పొగ మంచు అందాలు

సాగునీటి వనరులపై దృష్టి

అత్యవసర పనులు చేపట్టే యోచన

- ఉమ్మడి జిల్లాలో రూ.13 కోట్లతో ప్రతిపాదనలు
- కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత, షట్టర్లు, గ్రోయన్లకు మరమ్మతులు
- ఖరీఫ్‌లో సాగునీటికి అంతరాయం లేకుండా చర్యలు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వనరుల మరమ్మతులు, నిర్వహణపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఐదేళ్లపాటు చిన్నపాటి మరమ్మతులు చేయలేదు సరికదా అత్యవసర పనులకు కూడా పైసా విదల్చలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులు, చిన్ననీటి వనరులు, నదుల్లో ఉన్న గ్రోయన్ల మరమ్మతులు అటకెక్కడంతో రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.



పొదలతో ఉన్న పెద్దేరు కాలువ ప్రధాన కాలువ

కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులకు సంబంధించి అత్యవసర పనులు, కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత, చిన్నపాటి నిర్మాణాలు, షట్టర్లు, గ్రోయన్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ... మిగతా 6వ పేజీలో

సమస్యల్లో గర్భిణుల వసతి గృహం

వర్షానికి కారిపోతున్న పైకప్పు

- పనిచేయని ఆర్వో ప్లాంట్
- తలుపులు ఊడిపోయిన మరుగుదొడ్లు
- అవస్థలు పడుతున్న గర్భిణులు
- నిర్లక్ష్యానికి గురిచేసిన వైసీపీ ప్రభుత్వం



నిరుపయోగంగా మూలనపడిన ఆర్వో ప్లాంట్

చింతపల్లి, జూన్ 30:

ఐటీడీఏ నిర్వహణలో ఉన్న చింతపల్లి గర్భిణుల వసతి గృహం సమస్యల వలయంలో చిక్కుకున్నది. వసతి గృహం పైకప్పు పాడైపోవడంతో వర్షం కురిస్తే పూర్తిగా కారిపోతున్నది. గత వైసీపీ ప్రభుత్వం దీని నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. వైసీపీ పాలకులు కూడా కనీసం పట్టించుకోలేదు. అసౌకర్యాల నడుమ గర్భిణులు ప్రసవం కోసం నిరీక్షిస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో శివారు గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారుల సదుపాయం లేదు. దీంతో నెలలు నిండిన గర్భిణులను అతికష్టంపై ఆదివాసీలు డోలీపై ఆస్పత్రులకు తీసుకొస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో ప్రసవం కావడం, సకాలంలో మెరుగైన వైద్యం అందక మాత, శిశు మరణాలు సంభవించేవి. ఈ సమస్యను అధిగమించేందుకు 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో గర్భిణుల వసతి గృహాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. గర్భిణులు ప్రసవానికి 10, 15 రోజుల ముందు వసతి గృహాల్లో చేరితే పురిటి నొప్పులు వచ్చే వరకు నిరీక్షించవచ్చు. పురిటినొప్పులు ప్రారంభంకాగానే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు అనువుగా ఉంటుందని గర్భిణుల వసతి గృహాల నిర్మాణాలకు టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదన మరుగునపడిపోయింది. అయితే 2021లో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంగి గోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చింతపల్లిలో గర్భిణుల వసతి గృహం నిర్మాణానికి రూ.7.5లక్షల ఐటీడీఏ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు సంతబయలులోనున్న కల్యాణ మండపాన్ని ఆధునీకరించారు. గర్భిణులు బస చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. అదే ఏడాది సెప్టెంబరు నుంచి ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలో గర్భిణుల వసతి గృహం నడుస్తున్నది. ప్రస్తుతం వసతి గృహంలో ... మిగతా 6వ పేజీలో



చింతపల్లిలో గర్భిణుల వసతి గృహం

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దొరబాబు (ఫైల్)

బుచ్చెయ్యపేట, జూన్ 30: రోడ్డు ప్రమాదంలో వడ్డాదికి చెందిన యువకుడు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వడ్డాదికి చెందిన అడపా దొరబాబు (45) ఒడిశాలోని జగదాల్‌పూర్‌లో తన కారును ఓ కంపెనీకి అద్దె ప్రాతిపదికపై నడుపుతున్నాడు. ఆ క్రమంలో జగదల్‌పూర్‌లో శనివారం రాత్రి కారు నడుపుతుండగా వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే దొరబాబు మృతి చెందాడు. దొరబాబు మృతితో భార్య, ఇద్దరు కుమారులు, తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దొరబాబు మృతదేహం సోమవారం వడ్డాది చేరుకుంటుందని కుటుంబీకులు తెలిపారు.

కారు ఢీకొని భార్య, భర్తకు గాయాలు

నక్కపల్లి, జూన్ 30: ఉపమాక హైవే జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య భర్త తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. నక్కపల్లికి చెందిన లోడ సూర్యారావు, అచ్చియ్యమ్మ దంపతులు బైక్‌పై తునిలో ఉన్న తన మనుమరాలిని చూసి తిరిగి వస్తున్నారు. ఉపమాక హైవే జంక్షన్ వద్దకు చేరుకుని మలుపు తిరుగుతుండగా, విశాఖ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇరువురికీ గాయాలయ్యాయి. నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండదు

» రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మధురవాడ, జూన్ 30 : క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పీఎం పాలెంలోని ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతిభకే పట్టం కడతామన్నారు. క్రీడల్లో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారన్నారు. కొన్నేళ్లుగా క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండడంతో ప్రతిభ గల క్రీడాకారులు అవకాశాలు లేక మరుగునపడిపోతున్నారని చెప్పారు. ఏపీఎల్ వంటి మ్యాచ్‌ల్లో క్రికెటర్లు ప్రతిభ చూపి ఐపీఎల్, అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రికెట్ మైదానం అభివృద్ధికి అవసరమయితే బీసీసీఐ నుంచి కూడా నిధులు సమీకరిస్తామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులు ఎందరో ఉన్నారని, వారందరికీ ప్రస్తుతం క్రీడా మైదానాల కొరత ఉందని వాటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీడీసీఏ అధ్యక్షుడు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నగరంలో క్రీడా మైదానాల కొరత ఉందని క్రికెటర్లను ప్రోత్సహించాలంటే అందరికీ అందుబాటులో మైదానాలు ఉండాలన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి కలెక్టర్ మయూర అశోక్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఉత్తేజాన్ని పెంపొందిస్తాయన్నారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ ఏపీఎల్ వంటి మ్యాచ్‌లు క్రీడాకారుల ప్రతిభకు పదును పెడతాయన్నారు. ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎల్‌ను వేదికగా చేసుకొని ఎందరో క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. పీఎల్-3లో 19 మ్యాచ్‌లు జరగనున్నాయని ఇవి ఈనెల 13న ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహచలం, జూన్ 30 : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ వద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్కటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజలు చేశారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో అర్జిత నిత్యం కల్యాణం జరిపారు.మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గిరిజనుల జీవన విధానంపై ఫొటోగ్రఫీ సదస్సు



ఫొటో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన చిత్రం

విశాఖపట్నం, జూన్ 30 : జాతీయ కెమెరా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ సభ్యులు ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు లంబసింగి, తాజంగి, కొత్తపల్లి జలపాతాలు, అరుకు వ్యాలీలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. వారి జీవన విధానంపై ఫొటోలు తీసి వాటిపై ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నేచర్, స్టిల్ లైఫ్, ల్యాండ్ స్కేప్ అంశాలపై ఫొటోగ్రాఫర్లకు అవగాహన కల్పించారు. కొర్లపాటి నరస్వతీరావు మాట్లాడుతూ స్టిల్ లైఫ్, నేచర్ ఫొటోగ్రఫీపై ప్రసంగించారు. సొసైటీ కార్యదర్శి సీనియర్ ఫొటో జర్నలిస్ట్ ఎంవీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు, కొండా జాన్సా, వీవీ రామరాజు, రమేష్ చంద్రబోస్, డీవీ రమణ, పల్లా శ్రీనివాస్, మురుగేష్ అయోధ్య, సాయిరాం, ఎన్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

సేవలు విస్తృతం.. పరిధి పరిమితం

కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి సమస్యల సుస్తీ

» ఏళ్లు గడిచినా కార్యరూపం దాల్చని సీహెచ్‌సీ ప్రతిపాదన
» వేధిస్తున్న సిబ్బంది కొరత
» అరకొరగా మందులు
» కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం

కృష్ణాదేవి పేట, జూన్ 30: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఆరు ఎకరాల్లో గల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా మార్చాలన్న ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాగా ఉన్నప్పుడు ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖఉన్నతాధికారులు 2019లో ప్రతిపాదించారు. అయితే అదే ఏడాది అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనికి గురించి పట్టించుకోకపోవడం, కరోనా మహమ్మారి వంటి కారణాల వల్ల పీహెచ్‌సీని సీహెచ్‌సీ మారడం జరగలేదు. దీంతో గిరిజన, మైదాన ప్రాంతాల రోగులు అత్యవసర సమయంలో వైద్య కోసం నర్సీపట్నం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటున్నది.



పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వేచి ఉన్న రోగులు

రాష్ట్ర విభజనకు ముందు ఈ పది పడకల పీహెచ్‌సీలో కొయ్యూరు మండల పరిధిలోని సుమారు 40 గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందేవారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆ గ్రామాలను కొయ్యూరు పీహెచ్‌సీలో విలీనం చేశారు. ప్రస్తుతం ఏఎల్‌పురం, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం, విప్పలపాలెం ఏడు సచివాలయ పరిధిలో ప్రజలకు ఈ పీహెచ్‌సీనే ఆధారం. గతంలో పాడేరు ఐటీడీఏ పరిధిలో ఈ పీహెచ్‌సీ ఉండేది. కొయ్యూరు పీహెచ్‌సీ 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విలీనం చేసిన గిరిజన గ్రామాలకు దగ్గరలో ఉన్న కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో రోగులు, గర్భవతులు ఇక్కడ వైద్య సేవలు పొందడం తప్పలేదు. ఒక్కో పీహెచ్‌సీకి 11 మందే వైద్య సిబ్బంది చాలు అనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం ఈ పీహెచ్‌సీలో ఉన్న అదనపు వైద్యసిబ్బందిని బదిలీ చేసింది. దీంతో ఇక్కడ నలుగురు సిబ్బందిని బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ప్రతి రోజు 150 నుంచి 200 మంది రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. అయితే 'సేవలు విస్తృతం.. పరిధి పరిమితం' అనే చందంగా పీహెచ్‌సీ తయారంది. అవసర మేరకు సరిపడే వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవటంతో వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారు. అంతేకాకుండా రోగులకు సరిపడే స్థాయిలో మందులు ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మందులు బయట కొనుకోలు చేయాల్సి వస్తోందిన రోగులు వాపోతున్నారు. ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీ చేసి సేవలు మెరుగు పరిచాలని స్థానికులు కోరుతున్నారు.

ఫార్మా వ్యర్థాలపై భరిణికం గ్రామస్థులు ఆందోళన

» మల్లోడి గెడ్డలో జలాలు పరిశీలన
» ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పరవాడ, జూన్ 30: ఫార్మా వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని భరిణికం గ్రామస్థులు డిమాండ్ చేశారు. 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కొన్ని ఫార్మా కంపెనీల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘించి వ్యర్థ జలాలను గుట్టుచప్పుడు కాకుండా బయటకు విడిచిపెట్టడంతో అవి గెడ్డల్లో దర్శనమిస్తున్నాయి. పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న స్థానిక మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా ఫార్మా వ్యర్థ జలాలతో గెడ్డ నిండిపోయింది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాలను 'ఆంధ్రజ్యోతి'లో ప్రస్తావించడంతో భరిణికం గ్రామస్థులు మేల్కొన్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు మల్లోడి గెడ్డ వద్దకు చేరుకుని ఫార్మా వ్యర్థజలాలను పరిశీలించారు. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇలా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే సదరు యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యర్థ జలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, వ్యవసాయానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మూగజీవాలతో పాటు జల చరాసులు మృత్యువాతపడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొండా తాతారావు, పెదిశెట్టి సత్యారావు, బొండా వెంకట సత్యారావు, జి.అప్పలరాజు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాలు సేకరించిన పీసీబీ

ఇదిలావుంటే, మల్లోడి కాలువ కల్వర్టు వద్ద నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు ఆదివారం పరిశీలించి, నీటి నమూనాలను సేకరించారు. మూడు రోజుల్లో దీనికి సంబంధించి నివేదికను తెలియజేస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అధ్వానంగా మాకవరపాలెం బస్టాండ్



బురదమయంగా ఉన్న బస్టాండ్ ఆవరణ

మాకవరపాలెం, జూన్ 30: మండల కేంద్రం మాకవరపాలెంలో బస్టాండ్ గోతులమయంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. చిన్నపాటి జల్లులు కురిస్తే బస్టాండ్ ఆవరణ అంతా వర్షం నీరు చేరి అధ్వానంగా తయారవుతోంది. ఇక్కడకు వచ్చే ప్రయాణికులు అడుగు తీసి అడుగు పెట్టలేని దుస్థితి ఎదురవుతోంది. అంతా అపరిశుభ్రంగా మారిపోతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ కారణంగా వర్షం వస్తే చాలు బస్టాండ్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. దీనికితోడు ఇటీవల బస్టాండ్ ఆవరణలో షాపుల నిర్మాణం చేపట్టడంతో నిర్మాణసామగ్రి కూడా వేశారు. దీంతో ఆవరణ ఇరుకుగా మారి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. వర్షం వస్తే చాలు బస్టాండ్ ప్రాంతం బురదగా మారిపోతోంది. ఆ సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా అడుగు వేసినా జారిపోవడం జరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు పడిపోయి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బస్టాండ్ ఆవరణ నుంచి వర్షం నీరు బయటకు వెళ్లే ఏర్పాటు చేయాలని అంటున్నారు. ఇప్పటికైనా బస్టాండ్ ఆవరణలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీ-20 వరల్డ్ కప్ విజయంతో సంబరాలు

పాయకరావుపేట, జూన్ 30: భారత్ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకోవడం పట్ల మండలంలో క్రికెట్ అభిమానులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు, బాణసంచా కాల్పులతో సందడిచేశారు. కేక్‌లను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ క్రికెట్ ప్లేయర్స్ గెడ్డం చలపతి, గొల్లపల్లి నాగు, దనిశెట్టి బాబి, ఎజ్జల చంద్రశేఖర్, చలపాక నాగేశ్వరరావు, పెదిరెడ్డి పండు తదితరులతో పాటు క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న క్రికెట్ అభిమానులు



నక్కపల్లిలో కూటమి నాయకులు స్వీట్లు పంపిణీ

నక్కపల్లి : టీ-20 వరల్డ్ కప్ చాంపియన్‌గా ఇండియా నిలవడంతో నక్కపల్లిలో పలువురు క్రీడాభిమానులు, కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చాలా కాలం తరువాత రోహిత్ సేన ఈ ఘనత సాధించడం చాలా సంతోషంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరు శ్రీనివాసరావు, వైబోయిన రమణ, దార్ల కృష్ణ, పెదిరెడ్డి రమేశ్, రాంబాబు, దేవవరపు లోవరాజు, సురేంద్ర, అప్పన్న తదితరులు స్వీట్లు పంచిపెట్టారు.

చినుకు పడితే.. నరకమే!

కోటవురట్ల ఎంపీడీవో ఆఫీస్ రోడ్డులో నిలిచిపోతున్న నీరు

మురుగు చేరుతుండడంతో రాకపోకలకు మరిన్ని ఇబ్బందులు



ఇటీవల కురిసిన వర్షాలకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

కోటవురట్ల, జూన్ 30 : చినుకుపడితే.. కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయం రోడ్డుపై ప్రయాణం నరకమే. ఇక్కడ ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకోవడంతో పాటు కాలువలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా వర్షాకాలం వస్తే రాకపోకలకు జనం ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటాయి. వర్షపు నీరుకు తోడు మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారుల ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. మోకాళ్ల లోతున నీరు ఉంటుండడంతో ద్విచక్ర వాహనాల ఇంజన్, సైలెన్సర్లలోకి నీరు చేరుతుండడంతో అవి ముందుకు కదలని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక పాదచారుల అవస్థలు చెప్పనక్కర్లేదు. దీర్ఘకాలంగా ఇక్కడ ఈ సమస్య ఉన్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించరూ..

» అధికారులకు నీళ్లబంధ గ్రామస్థుల వినతి



నీళ్లబంధ గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్న గిరిజనులు

రోలుగుంట, జూన్ 30: తమ గ్రామానికి కనీస వసతులు కల్పించాలంటూ పీవీటీజీ ఆదిమ తెగ గిరిజనులు వేడుకుంటున్నారు. మండలంలోని అర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డ శివారు నీళ్లబంధ గ్రామస్థులు ఆదివారం వినూత్న రీతిలో నిరసనకు దిగారు. తమకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలంటూ అధికారులకు దండం పెడుతూ ఆందోళన చేపట్టారు. ఈ గ్రామంలో ఆరు కుటుంబాలు ఉంటున్నాయి. వర్షాకాలంలో వీరికి చెలమల్లోని నీరే గతి. మంచినీటి సౌకర్యం కల్పించాలంటూ గ్రామస్థులు ఎన్నాళ్ల నుంచో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఇక్కడ పిడుగుపడి అందుబాటులో ఉన్న సోలార్ బ్యాటరీ కూడా పేలిపోయింది. దీంతో రాత్రివేళల్లో చీకట్లో మగ్గిపోతున్నా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు ముందుకు రావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కనీసం రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర వైద్యం అందాలంటే డోలి మోతతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు కనీస వసతులు కల్పించాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

బ్యాలెట్ ద్వారా మత్స్యకార సొసైటీల ఎన్నికలు

» ఏపీ మత్స్యకార జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి



మత్స్య శాఖాధికారులకు రాసిన లేఖ చూపుతున్న ప్రతినిధులు

నక్కపల్లి, జూన్ 30 : రాష్ట్రంలో మత్స్యకార సహకార సొసైటీల ఎన్నికలు నిర్వహించేటప్పుడు బ్యాలెట్ పద్ధతిని అవలంభించాలని ఏపీ మత్స్యకార జేఏసీ అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య, కార్యదర్శి పిక్కి కోదండరాం కోరారు. ఈ మేరకు వారు మత్స్యశాఖాధికారులకు ఆదివారం లేఖ రాశారు. అనంతరం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పూర్వం నుంచి మత్స్యకార సొసైటీలు, చెరువులు, రిజర్వాయర్ల వంటి సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు జరుపుతున్నారన్నారు. ఈ విధానం వల్ల ఎవరు ఎవరికి ఓటేశారో తెలిసిపోతుందని, ఫలితంగా ఆయా గ్రామాల్లో ఘర్షణలు జరుగుతుండడంతో పాటు పోలీస్ కేసుల వరకూ పరిస్థితులు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార సొసైటీల్లో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఓటర్లుగా చేర్చాలని కోరారు. ప్రభుత్వం బ్యాలెట్ పద్ధతిలో మత్స్యకార సొసైటీల ఎన్నికలు జరపా లని విజ్ఞప్తి చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, జూన్ 30: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లభర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 25న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఐడీ స్లిప్ ప్రింట్, ఒరిజిల్ సర్టిఫికెట్లు తీసుకొని దగ్గరలో ఉన్న ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికేట్లు పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈనెల 27న నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈ నెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్‌కి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 87907 41378, 89772 72231, 70137 37243లో సంప్రదించాలని తెలిపారు.

ఏయూ మాజీ వీసీ వేధింపులపై నేడు విచారణ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై వర్సిటీ న్యాయ విద్యార్థిని సత్యాల అంజనాప్రియ జాతీయ ఎస్సీ కమిషన్‌కు చేసిన ఫిర్యాదుపై సోమవారం విచారణ జరగనుంది. విశాఖ తూర్పు ఏసీపీ పోలీస్ కార్యాలయంలో విచారణకు రావాలని పోలీసులు న్యాయ విద్యార్థినికి సమాచారం పంపారు. వర్సిటీలో హాస్టల్ ఫీజులపై న్యాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న అంజనాప్రియ సమాచార హక్కు చట్టం కింద గత ఏడాది దరఖాస్తు చేశారు. ఈ మేరకు సమాచారం ఇవ్వకుండా మహిళా హాస్టల్ వార్డెన్ పల్లవి నుంచి అంజనాప్రియకు బెదిరింపులు రావడంతో సదరు విద్యార్థిని జాతీయ ఎస్సీ కమిషన్‌కు గత ఏడాది డిసెంబరు 12న ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎస్సీ కమిషన్ నగర పోలీస్ కమిషనర్, ఏయూ వీసీకి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు హాస్టల్ వార్డెన్‌ను విచారించారు.ఈలోగా అంజనాప్రియ ఈనెల13న మరోసారి జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదుచేయడంతో తాజాగా నోటీసులు జారీచేశారు. దీంతో సోమవారం విశాఖ తూర్పు సబ్‌డివిజన్ పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 30: ఆల్ విశాఖ చెస్ సంఘం నిర్వహించిన జిల్లా అండర్- 19 ఓపెన్, మహిళల చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో లంక మార్తాండ కుమార్, వైభవ్ గ్రంధి, తనీష్ చొప్ప, లక్ష్మణ్ ఉద్ధవ్..మహిళల విభాగంలో నిధి కేశవరావు, మధుపడ మనస్వి, అఫ్సీన్ అహ్మద్, దత్తి ధార్మిక విజేతలుగా నిలిచారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీ ముగింపు కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ధ్రువ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు బాబూరావు, ఎస్. మణికంఠరావు, ఉమామహేశ్వరరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డరవీధిలో దుక్కి పనులు చేస్తున్న గిరిజన రైతులు

సమైక్యం.. గిరిజనుల జీవనం

» వ్యవసాయ పనుల్లో ఐక్యత చాటుకుంటున్న ఆదివాసీలు

గూడెంకొత్తవీధి, జూన్ 23: మండలంలో ఆదివాసీలు వ్యవసాయ పనుల్లోనూ ఐక్యత చాటుకుంటున్నారు. ఒకరి పొలంలో మిగిలిన రైతులంతా కలిసి పనిచేస్తూ పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. వ్యవసాయంలో కూలీలు పెట్టుకునే ఆర్థిక స్తోమత గిరిజనుల రైతులకు ఉండదు. దీంతో గ్రామానికి చెందిన గిరిజనులందరూ ఒకరి పనుల్లో ఒకరు సహాయం చేసుకుంటారు. దుక్కులు, ఆకుతీత, వరి నాట్లు తదితర పనులను అందరూ కలిసి చేసుకుంటారు. ఒక రోజు ఒకరి పొలం దున్నేందుకు రైతులంతా వస్తే, మరో రోజు వేరే రైతు పొలం దున్నేందుకు వెళ్తారు. దుక్కి, ఆకుతీత, వరి నాట్లలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తారు. ఒకరికొరు పరస్పరం సహకరించుకుంటూ వ్యవసాయ పనులు చేసుకుని తమలోని ఐక్యతను చాటుకుంటారు.

పెట్రోల్ బంక్ ట్యాంకులో వర్షం నీరు

» సీలేరులో రెండు రోజులుగా నిలిచిన విక్రయాలు

» వినియోగదారులు పడరాని పాట్లు



నీరు కలిసిపోయిన పెట్రోల్ తోడుతున్న టెక్నికల్ సిబ్బంది

సీలేరు, జూన్ 30: సీలేరు గిరిజన సహకార సంస్థ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ట్యాంకులోకి వర్షపు నీరు చేరింది. ఫలితంగా రెండు రోజులుగా విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీలేరులో గురువారం కురిసిన భారీ వర్షానికి భూ గర్భంలో ఉన్న పెట్రోల్ ట్యాంకులోకి నీరు చేరింది. పెట్రోల్‌లో నీరు కలిసిపోవడంతో జీసీసీ అధికారులు విక్రయాలు నిలిపివేశారు. ఈ విషయాన్ని హెచ్‌పీసీఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం సాంకేతిక సిబ్బంది వచ్చి భూగర్భ ట్యాంకులో కలిసిపోయిన నీటిని తోడే పనులు చేపడుతున్నారు. ట్యాంకులో సుమారు 2,200 లీటర్ల నీరు చేరిందని సిబ్బంది తెలిపారు. ట్యాంక్ నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల ఈ సమస్య తలెత్తినట్టు వారు చెప్పారు. కాగా పెట్రోల్ విక్రయాలను సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

సీలేరు వారపు సంత వెలవెల



వర్షం కారణంగా వెలవెలబోతున్న వారపు సంత

సీలేరు, జూన్ 30: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు మేజర్ పంచాయతీలో ఆదివారం జరిగిన వారపు సంత వెలవెలబోయింది. తెల్లవారుజాము నుంచి సీలేరు పరిసర గ్రామాల్లో వర్షం కురుస్తుండడంతో వారపు సంతకు గిరిజనులు పెద్దగా రాలేదు. మధ్యాహ్నం వరకు ముసురు వాతావరణం నెలకొంది. తరువాత కూడా వర్షం తగ్గుముఖం పట్టలేదు. దీంతో వారపు సంతకు స్థానిక ప్రజలు తప్పితే ఇతర ప్రాంతాల నుంచి జనాలు రాలేదు. ఫలితంగా సంత బోసిపోయింది.

సమస్యల్లో గర్భిణుల వసతి గృహం

... 3వ పేజీ తరువాయి



రేకులు పగిలిపోవడంతో రంధ్రాలు ఏర్పడిన వసతిగృహం పైకప్పు

ప్రతి రోజు 10 నుంచి 15మంది గర్భిణులు బస చేస్తున్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు మూడు షిఫ్ట్‌ల్లో సేవలందిస్తున్నారు. గర్భిణులకు అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం అందిస్తున్నారు. పురిటి నొప్పులు రాగానే ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచుతున్నారు.

వసతి గృహం నిర్వహణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గత రెండేళ్లగా చింతపల్లి గర్భిణుల వసతి గృహం నిర్వహణను వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. దీంతో గర్భిణులు అసౌకర్యాలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏడాది క్రితం వసతి గృహం పైకప్పు పూర్తిగా పాడైపోయింది. పలు చోట్ల రేకులు పగిలిపోవడంతోపాటు భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కారిపోతున్నది. దీంతో గర్భిణులు భవనంలోని ఓ మూలకు బెడ్స్ జరుపుకుని పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షపు నీరు భవనంలో లోపలకు వస్తుండడంతో గర్భిణులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వెచ్చదనంలో ఉండాల్సిన గర్భిణులు వర్షపు నీరు కారణంగా చల్లదనంతో ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులు, వైద్య సిబ్బంది పలుమార్లు వైసీపీ పాలకుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోలేదు.

మూలన పడిన ఆర్వో ప్లాంట్..

గర్భిణుల వసతి గృహంలో నిర్మించిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా మూలకు చేరింది. ఆర్వో ప్లాంట్ నిర్మించిన ఆరు నెలలకే మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో గర్భిణులకు రక్షిత నీరు అందుబాటులో లేకుండా పోయింది. భోజన కాంట్రాక్టరు నీళ్ల ట్యాంక్‌తో మంచి నీటి సరఫరా చేస్తున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో గర్భిణులు వాటర్ బాటిల్ కొనుక్కోవాల్సి వస్తున్నది. అలాగే వసతి గృహంలో మరుగుదొడ్డి మరమ్మతులకు గురైంది. తలుపు ఊడిపోవడంతో సిగ్గు విడిచి గర్భిణులు మరుగుదొడ్డిలో కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి.

పైకప్పు మరమ్మతులు చేపట్టాలి

-జర్త కాసులమ్మ, గర్భిణీ అటెండెంట్



చిన్నపాటి వర్షం కురిసినా వసతి గృహం పూర్తిగా కారిపోతున్నది. వసతి గృహం లోపలకు వర్షపు నీరు చేరడంతో బెడ్స్ తడిసిపోతున్నాయి. వర్షం వస్తే గర్భిణులు పడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. వసతి గృహం పైకప్పు మరమ్మతులు చేపట్టాలి.

మరుగుదొడ్లు మరమ్మతు చేయాలి

-ఎం.దారమల్లేశ్వరి, గర్భిణీ అనరాడ



వసతి గృహంలో రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఒక మరుగుదొడ్డి తలుపు ఊడిపోయింది. దీంతో ఒకే మరుగుదొడ్డిని మల, మూత్ర విసర్జనకు ఉపయోగిస్తున్నాం. మరమ్మతులకు గురైన మరుగుదొడ్డి బాగు చేయడంతోపాటు ఆదనపు మరుగుదొడ్లు నిర్మించాలి. రక్షిత నీరు కోసం ఆర్వో ప్లాంట్ వినియోగంలోకి తీసుకు రావాలి.

అరకు సంత.. చినుకుపడితే చింత!

» బురదతో చిందరవందరగా పరిసరాలు

» వ్యాపారులు, రైతులు, గిరిజనుల అగచాట్లు



బురదలోనే క్రయవిక్రయాలు చేస్తున్న రైతులు, వ్యాపారులు

డుంబ్రిగుడ, జూన్ 29: అరకు పంచాయతీ కేంద్రంలో వారపు సంత చినుకు పడితే చిత్తడవుతోంది. ప్రతీ శుక్రవారం నిర్వహించే ఈ వారపు సంతలో వర్షా కాలంలో రైతులు, వినియోగదారులు, గిరిజనులకు చింత తప్పడం లేదు. ఈ సంత ఆంధ్ర, ఒడిశాలోని అనేక రకాల వ్యాపారులకు అనువుగా ఉంటుంది. అయితే కనీస సదుపాయాలు కల్పించడంపై పంచాయతీ పాలకులు, అధికారులు ఏమాత్రం దృష్టిసారించడం లేదు. కోట్లాది రూపాయల లావాదేవిలు సాగే సంత ప్రతీ ఏటా ఆశీలు ద్వారా లక్షలాది రూపాయల టెండర్ జరుగుతోంది. అయా నిధులు సంత అభివృద్ధికి ఉపయోగిస్తున్నారా.. దేనికైనా మళ్లిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా వర్షా కాలంలో చినుకు పడితే సంత దారుణంగా తయారవుతున్నదని, దీంతో పడరాని పాట్లు పడుతున్నామని గిరిజనులు, రైతులు, వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి అరకు సంత జరిగే పరిసరాలను అభివృద్ధి చేయాలని, ఏ కాలంలోనైనా ఇబ్బందులు లేకుండా సంత నిర్వహించుకునేలా తీర్చిదిద్దాలని వారు వేడుకుంటున్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

» మొక్కులు తీర్చుకున్న భక్తులతో పండగ సందడి



ఘటాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్తున్న భక్తులు

పాడేరురూరల్, జూన్ 30: గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు ఉదయం 7 గంటలకే ఆలయానికి ఘటాలతో చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో పండగ సందడి నెలకొంది. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పండగలు చేసుకోవడంతో సాయంత్రం 5 గంటల వరకు ఆలయం వద్ద సందడి నెలకొంది. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు కె.రామారావు, పోతురాజు, ఎస్.కొండలరావు తదితరులు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్‌లో అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంతానికి చెందిన వివిధ మండలాల భక్తులు హాజరై మొక్కులు తీర్చుకొని పండగలను నిర్వహించారు.

సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

» టీడీపీ మండల అధ్యక్షుడు బలరాం

ముంచంగిపుట్టు, జూన్ 30: పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని, లేనిపోంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సహకరించకుండా, పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేసిన వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా పని చేస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జులై 1వ తేదీన ప్రభుత్వం చేపట్టిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో నాయకులంతా పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.రామ్మూర్తి, సర్పంచ్ వి.లక్ష్మణ్, మాజీ సర్పంచులు వి.రామస్వామి, ఎం.ముకుందపడాల్, మాజీ వైస్ ఎంపీపీ ఆర్.కొండలరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.బాబాజీ, క్లస్టర్ ఇన్చార్జిలు ఎం.చిన్నిబాబు, కామరాజు, ప్రసాద్ పడాల్, గణపతి, సత్యం, గోపాల్ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి మన్యం సమస్యలు

పాడేరు రూరల్, జూన్ 30: రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ జి.శేషగిరిరావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులు, వివిధ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించామన్నారు. అలాగే డిమాండ్లకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంల్లో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం, నాయకులు కె.నాగేశ్వరరావు, కె.చిరంజీవి, హెచ్‌ఎంల అసోసియేషన్ నాయకులు ఎస్.పూర్ణచందరరావు, టి.నాగేశ్వరరావు, ప్రదీప్ చంద్ర, గోపాలరాజు, జి.రామ్మోహన్ పాల్గొన్నారు.

అరకు కాఫీని పీఎం ప్రశంసించడంపై హర్షం

అరకులోయ, జూన్ 30: అరకు కాఫీ ప్రత్యేకతను పీఎం మోదీ ప్రస్తావించడం హర్షణీయమని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అల్లూరి జిల్లాలో లక్షన్నర మంది గిరిజనులు కాఫీ తోటలను సాగు చేస్తున్నారన్నారు. గతంలో విశాఖ పర్యటనలో సీఎం చంద్రబాబుతో కలిసి పీఎం మోదీ అరకు కాఫీ రుచి చూశారని గుర్తు చేశారు. ఢిల్లీ కేంద్రంగా జరిగిన జీ20 సమ్మిట్‌లోనూ అరకు కాఫీ మరింత ప్రాచుర్యం పొందిందన్నారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కాఫీ, మిరియాలకు మరింత మంచి గిట్టుబాటు ధర లభించేలా బాధ్యత తీసుకోవాలని కోరారు.

నేడే పింఛన్ల పండగ

... 3వ పేజీ తరువాయి

మేలు జరగనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 98 శాతం లబ్ధిదారులు గిరిజనులు కావడం విశేషం. జిల్లాలో జీకేవీధి మండలంలో అత్యధికంగా 7,858 మంది, అత్యల్పంగా మారేడుమిల్లి మండలంలో 2,039 మంది పెన్షన్ లబ్ధిదారులున్నారు. సగటున జిల్లాలో ప్రతి మండలంలో ఐదు వేల మంది పెన్షన్ లబ్ధిదారులున్నారనే ఒక అంచనా. అలాగే మొత్తం లబ్ధిదారులను పరిశీలిస్తే.. వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారులు 76,462 మంది, వింతంతువులు 38,791, దివ్యాంగులు 8,791, చేనేత 88, అభయహస్తం 1,208, మత్స్యకారులు 45, ఒంటరి మహిళలు 1,257, కల్లుగీత కార్మికులు 8, ట్రాన్స్‌జెండర్లు 38, డప్పు కళాకారులు 62, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు 24, సైనిక వెల్ఫేర్ పెన్షనర్ 1, వైద్యపరమైన సమస్యలతో పెన్షన్ పొందుతున్న 1,121 మందితో కలిపి మొత్తం లక్షా 27 వేల 894 మంది పెన్షన్ లబ్ధిదారులు న్నారు.

సాగునీటి వనరులపై దృష్టి

... 3వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలో అత్యవసర పనులకు రూ.13 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తాండవ ప్రాజెక్టు పరిధిలో కాలువలు, ఇతరత్రా మరమ్మతులకు రూ.1.8 కోట్లు, రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టు పరిధిలో పనులకు రూ.3.3 కోట్లు, చిన్ననీటిపారుదల ప్రాజెక్టులు, చెరువులు, నదుల్లో గ్రోయన్లు, గండ్లు పూడ్చివేతకు రూ.7.7 కోట్లతో పనులు చేయాలని ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల వనరుల ద్వారా 4.25 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో కాలువల్లో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో ఎక్కడక్కడా మట్టి పేరుకుపోవడం, చెట్లు, పొదలు పెరగడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రాజెక్టుల పరిధిలో శివారు భూములకు నీరు అందని పరిస్థితి నెలకొనడంతో చాలా ప్రాంతాల్లో పంటలపై తీవ్ర ప్రభావం నెలకొంది. చెరువులు, కాలువలకు ఎక్కడక్కడా గండ్లు పడడం, షట్టర్లు పాడవడం, నదుల్లో గ్రోయన్లు కొట్టుకుపోవడంతో పొలాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు వచ్చాయి. దీనిపై రైతులు మొర పెట్టుకున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. అయితే గత వారం జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులతో సమీక్షించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అత్యవసర పనుల కోసం రూ.13 కోట్లతో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలపై వచ్చే ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించే సమావేశంలో చర్చించనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే పనులు చేయడానికి అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

రీమలి జాన్‌కు ఘన సత్కారం



జాన్ దంపతులను సత్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా

పాడేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యా శాఖలో ప్యానల్ గ్రేడ్ హెడ్‌మాస్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన రీమలి జాన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. గిరిజన విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, టీడీపీ టీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలువర్తి గోవిందరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు కొనియాడారు. ఈ సందర్భంగా జాన్ దంపతులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంతంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జీసీసీ బీఎం మోహన్ సేవలు ఆదర్శనీయం



మోహన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జూన్ 30: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్ మేనేజర్ చెట్టి మోహన్ సేవలు ఆదర్శనీయమని జీసీసీ పాడేరు డీఎం డి.సింహాచలం అన్నారు. ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో మోహన్ దంపతులను జీసీసీ అధికారులు, సేల్స్‌మాన్‌లు, ఉద్యోగులు, వివిధ పార్టీల నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ 38 సంవత్సరాలకుపైగా గిరిజన సహకార సంస్థలో అంకితభావంతో పనిచేసి, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అందరి మన్ననలు పొందారన్నారు. జీసీసీకి మోహన్ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచులు ఎస్.సుభాష్, కె.త్రినాథ్, బాబూరావు, పి.పాండురంగస్వామి, జీసీసీ సూపరింటెండెంట్ పి.కుమారస్వామి, జీసీసీ ఉద్యోగులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

జిప్‌లైన్ పేరిట రూ.కోట్లు మింగేశారు!

... 3వ పేజీ తరువాయి

ప్రశ్నించినా పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇక చేసేది లేక గిరిజన సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు స్వయంగా బొర్రాగుహలు వద్ద ఉన్న జిప్‌లైన్‌ను పరిశీలించారు. అనంతరం పంచాయతీ ఆఫీసులో సర్పంచ్ అధ్యక్షతన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పంచాయతీ అనుమతులు తీసుకోలేదని, పెసా చట్టం మేరకు గ్రామసభ చేపట్టలేదని, ఎటువంటి అనుమతులు పొందలేదని విచారణలో తేలింది. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు టూరిజం అధికారులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ లేఖలు రాశారు. అలాగే విశ్రాంత ఐఏఎస్ అధికారి శర్మ కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తూ గిరిజన ప్రాంతంలో చట్ట విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తికి జిప్‌లైన్ నిర్వహణ ఏవిధంగా టూరిజం శాఖ కట్టబెడుతుందని ప్రశ్నించారు. తక్షణం అనుమతులు రద్దు చేసి, పర్యాటక శాఖకు గాని, ఐటీడీఏకు గాని, గ్రామ పంచాయతీకి గానీ అప్పగించాలని సూచించారు. సమతా సంస్థ సైతం ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ టూరిజం ఉన్నతాధికారుల ఆశీస్సులతో ప్రైవేటు వ్యక్తి దర్జాగా జిప్‌లైన్ నిర్వహించాడు. కోట్ల రూపాయల ఆదాయం 9 నెలలో సమకూరింది. విషయమేమిటంటే.. ప్రతి రోజూ బొర్రాగుహలు ప్రవేశ రుసుం ఆదాయం కంటే జిప్‌లైనర్ ఆదాయం రెట్టింపు రావడం గమనార్హం.

అనుమతులు చట్టవిరుద్ధం

పంచాయతీ, పెసా కమిటీ తీర్మానం

బొర్రాగుహలు వద్ద జిప్‌లైన్ ఏర్పాటుకు పంచాయతీ, పెసా కమిటీ అనుమతులు లేవని బొర్రా పంచాయతీ సర్పంచ్ జన్ని అప్పారావు, పెసా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. జిప్‌లైన్ నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించడం చట్ట విరుద్ధమని, జిప్‌లైన్ నిర్వాహకుడు పర్యాటక శాఖకు 12శాతం ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈనెల 25వ తేదీన సమావేశమైన పంచాయతీ, పెసా కమిటీ ప్రతినిధులు జిప్‌లైన్‌ను వెంటనే నిలుపుదల చేయాలని తీర్మానం చేశారు. అదేవిధంగా నిర్వహణ బాధ్యతలను స్థానిక బొర్రా జిప్‌లైన్ డవలప్‌మెంట్ సొసైటీ-కొయిటిగుడకు అప్పగించాలని తీర్మానించారు. అలాగే తొమ్మిది నెలలు నిర్వహించిన సమయంలో టికెట్ల రూపంలో వచ్చిన కోట్లాది రూపాయలు ఎవరి ఖాతాలోకి వెళ్లిందీ నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి జమ చేశారా లేక టూరిజం శాఖ ఉన్నతాధికారులకు ఇచ్చారా అని గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. టూరిజం శాఖ ప్రైవేటు వ్యక్తితో చేసుకున్న ఒప్పందం ప్రకారం 12 శాతం ఆదాయం ఎవరి ఖాతాలోకి ఎంత మేరకు జమ చేశారో ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి. జిప్‌లైన్ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని పంచాయతీ, పెసా కమిటీ, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సంక్షిప్తంగా..

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

చింతపల్లి, జూన్ 30: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో వి.వీరసాయిబాబు చెప్పారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. మండలంలో 9,551 మంది లబ్ధిదారులు ఉండగా రూ.6.65 కోట్ల నగదు మంజూరైందన్నారు. ఈ నెల 29న పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ నగదు పూర్తిగా బ్యాంక్‌ల నుంచి డ్రా చేశారన్నారు. తొలి రోజే లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అందుబాటులోలేని లబ్ధిదారులకు రెండో రోజు పంపిణీ చేస్తామని చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి, జూన్ 30: మండలంలో ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చింతపల్లి-లంబసింగి 33కేవీ విద్యుత్ లైన్‌పై ఆదివారం చెట్లు విరిగి పడిపోవడం వల్ల ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. ఏఈఈ వి.ప్రభాకరరావు, ఎల్‌ఐ గంగరాజు పర్యవేక్షణలో విద్యుత్ శాఖ సిబ్బంది 33కేవీ విద్యుత్‌లైన్‌పై ఏర్పడిన సాంకేతిక సమస్యను గుర్తించి తీగలపై పడిన చెట్లను తొలగించి, రాత్రి 8 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

పాముకాటుతో మహిళ మృతి



చిన్ని (ఫైల్ ఫొటో)

జి.మాడుగుల, జూన్ 30: మండలంలోని మారుమూల కిల్లంకోట పంచాయతీ సుర్తిపల్లి గ్రామానికి చెందిన కరిదేసి చిన్ని (35) పాముకాటుకు గురై ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం రాత్రి చిన్ని ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో పాము ఇంటిలో ప్రవేశించి కాటు వేసింది. దీంతో చిన్ని అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు, పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం చిన్నిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. చిన్నికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

లబడపుట్టు ఉపాధ్యాయుడు మృతి

ముంచంగిపుట్టు, జూన్ 30: మండలంలోని మాకవరం పంచాయతీ లబడపుట్టు జీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు జి.శ్యాంసుందర్ (35) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై మృతి చెందాడు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న శ్యాంసుందర్ ఇంటిలో గ్యాస్ బండ బిగిస్తుండగా ఆకస్మికంగా గుండెలో నొప్పి రావడంతో అతని భార్య సృజనకుమారి, స్థానికుల సహాయంతో సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. వైద్యాధికారి సంతోష్ వైద్య సేవలు అందించే లోపే గుండె నొప్పి ఎక్కువై మృతి చెందాడు. శ్యాంసుందర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతని స్వగ్రామం కరిముఖిపుట్టు పంచాయతీ తాంగులకు మృతదేహాన్ని తరలించారు. శ్యాంసుందర్ మృతిపై ఎంఈవో క్రిష్ణమూర్తి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు కోచింగ్ సెంటర్ ప్రారంభించాలి

పాడేరు రూరల్, జూన్ 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు ఎల్.రామారావు, కె.సురేంద్ర కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఆదివాసీలకు శతశాతం ఉపాధ్యాయ పోస్టులు కల్పించాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలల్లో సీట్లు కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరినట్టు చెప్పారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కిల్లో ధర్మన్నపడాల్, పి.బాలదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ముంచంగిపుట్టు, జూన్ 30: మండల కేంద్రంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రానికి చెందిన వి.చంద్రశేఖర్ కొంత కాలంగా ఫొటో స్టూడియో పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతను ఎంపీడీవో నివాస గృహాల సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. శనివారం రాత్రి రోజూ మాదిరిగానే అతను ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఏపీ 31 డీజె 9748 నంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనం ఎక్కడైనా కనిపిస్తే 8985884437 నంబరుకు కాల్ చేయాలని బాధితుడు చంద్రశేఖర్ కోరారు.

మన్యంలో ప్రతీ విద్యార్థికి కాస్మోటిక్స్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్‌యూ నాయకులు

పాడేరు రూరల్, జూన్ 30: ఆదివాసీ ప్రాంతంలో ప్రభుత్వ, గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న అన్ని తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్స్ అందించాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు కిశోర్‌కుమార్, బి.మాధవరావు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో విద్యార్థులకు సరఫరా చేయాల్సిన కాస్మోటిక్స్‌కు మంగళం పాడిందన్నారు. దీంతో విద్యార్థులు గజ్జి, తామర వంటి అంటు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అమ్మఒడితో పాటు కాస్మోటిక్స్ సరఫరా చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. గిరిజన సంఘం నేతలు బాబూజీ, అనిల్, కృష్ణ పాల్గొన్నారు.